క్లుప్తంగా

నియామకం



ఆత్మకూరు: కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కోఆర్డినేటర్‌గా మండల కేంద్రానికి చెందిన చిమ్మని దేవరాజును నియమిస్తూ మంగళవారం జిల్లా ఓబీసీ చైర్మన్ బొమ్మతి విక్రమ్ ఉత్తర్వులు జారీ చేయగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఉత్తర్వులపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు చలివాగు ప్రాజెక్టు తైబందీ నీటి విడుదల

శాయంపేట: మండలంలోని జోగంపల్లి శివారు చలివాగు ప్రాజెక్టు కింద ఆయకట్టు పంటలకు యాసంగి సీజన్‌కు నీరు అందించడానికి బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పాల్గొని తైబంది నీరు విడుదల చేస్తారని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

పల్లెప్రకృతి వనం పనులు ప్రారంభించాలి



దామెర: బృహత్ పల్లె ప్రకృతి వనం పనులు త్వరగా ప్రారంభించాలని ఆర్డీఓ రాము సూచించారు. మండల కేంద్రంలోని పెద్దగుట్ట సమీపంలోని ప్రభుత్వ భూమిని మంగళవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటు స్థలం అనుకూలంగా ఉందన్నారు. పల్లెప్రకృతి వనాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్, ఎంపీడీఓ ఎం, వెంకటేశ్వర్ రావు, ఎంపీఓ యాదగిరి, సర్వేయర్ కవితారాణి, కార్యదర్శి ఇంజపెల్లి నరేష్ తదితరులు ఉన్నారు.

ముగ్గుల పోటీలు



దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ ఇ–టెక్నో పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎస్. హర్షిణి, డి. హాసిని ప్రథమ. సిహెచ్. సహజ, జి. సౌమ్య ద్వితీయ. వి. క్రిష్ణప్రియ, ఏ. కావ్య తృతీయ బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ముఖ్య సలహాదారు దయ్యాల సదయ్య మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందు పండుగలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. న్యాయనిర్ణేతలుగా పరకాల బాలికల పాఠశాల ఉపాధ్యాయురాలు భేరి మాధవి వ్యవహరించగా కరస్పాండెంట్ శోభ, డైరెక్టర్లు రాకేష్‌భాను, దినేష్‌చందర్, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

13న ముగ్గుల పోటీలు

శాయంపేట: సంక్రాంతి సంబురాల్లో భాగంగా జీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 13న భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ఐదు రకాల ముగ్గులు వేయవచ్చన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతి రూ. 5వేలు, ద్వితీయ బహుమతి రూ. 3వేలు, తృతీయ బహుమతి రూ. 2వేలు, అందజేస్తున్నట్లు తెలిపారు. ఈపోటీల్లో మండలంలోని మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మిస్సింగ్ కేసు ఛేదన

పరకాల: సీసీ కెమెరాల సహాయంతో పరకాల పోలీసులు ఫిర్యాదు అందిన ఐదు గంటల్లో మిస్సింగ్ కేసును ఛేదించారు. వివరాలు.. పట్టణానికి చెందిన గోనెల లక్ష్మీ మంగళవారం తెల్లవారుజాము 4గంటల నుంచి కనిపించక పోవడంతో పోలీసులను సదరు మహిళ భర్త గోనెల నరసింహామూర్తి ఆశ్రయించాడు. సీఐ కిషన్ ఆదేశాల మేరకు ఎస్సై ప్రశాంత్‌బాబు ఎఫ్ఐఆర్ చేసి, పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు గుర్తించారు. బస్సు నంబర్ సాయంతో డ్రైవర్ వివరాలు కనుగొని లక్ష్మీ హనుమకొండ బస్టాండ్‌లో దిగినట్లు తెలుసుకున్నారు. పోలీసులు హనుమకొండకు చేరుకొని మహిళను తీసుకొచ్చి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిస్సింగ్ కేసు ఛేదించడానికి హోంగార్డు సుధాకర్ నిర్వర్తించిన బాధ్యతలను సీఐ కిషన్ అభినందించారు.

పాతపనుల పైసలు ఇప్పించండి

- మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ఆవేదన
- కొత్త పనులు చెప్పొద్దని వేడుకోలు
- పలు సమస్యలపై నిలదీత



అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

కమలాపూర్: తమకు కొత్త పనులు చెప్పొద్దని, పాత పనులకు సంబంధించిన పైసలిప్పించాలని కమలాపూర్ మండల సర్పంచ్‌లు కోరారు. ఎంపీపీ తడక రాణి అధ్యక్షతన మంగళవారం మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో తహసీల్దార్ రాణి కమలాపూర్ మండలంలోని ఎనిమిది గ్రామాల్లో తెలంగాణ క్రీడాప్రాంగణాలకు అనుకూలమైన ప్రభుత్వ స్థలాలు లేవని, ఎవరైనా ఎన్నారైల వంటి వారు ఉంటే వారి ద్వారా భూములు ఇప్పించాలని కోరారు. దీంతో సర్పంచులు ఇలా తమ గోడు వెళ్లబోసుకున్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో వెంటనే ఈజీఎస్ పనులు ప్రారంభించాలని డీపీఓ జగదీశ్వర్ సర్పంచులకు చెప్పగా, వెంటనే బిల్లులు వచ్చే పనులు ఎస్ఎంసీ చైర్మన్లకు, ఆలస్యంగా బిల్లులు వచ్చే పనులు సర్పంచులకు అప్పగిస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఉప్పల్‌కు కుళాయిల ద్వారా మిషన్ భగీరథ మంచి నీళ్లు రావడం లేదని, మీటరు లోతులో వేయాల్సిన పైప్ లైన్లను ఫీటు లోతులో వేయడంతో ఎక్కడికక్కడ పైప్ లైన్లు లీకవుతున్నాయని, చివరకు తాము ఉంటున్న ఏరియాకు కూడా నీళ్లు రావడం లేదని ఎంపీటీసీ సంపత్‌రావు, సర్పంచ్ దేవేందర్‌రావు సంబంధిత అధికారులను నిలదీశారు. కమలాపూర్ ఎంజేపీ, ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లపై మాదన్నపేట ఎంపీటీసీ శ్రీనివాస్ అధికారులను నిలదీశారు. కమలాపూర్ సీహెచ్‌సీ వైద్య సేవలపై పంగిడిపల్లి సర్పంచ్ శ్రీనివాస్, వంగపల్లి ఎంపీటీసీ రామస్వామి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తనకు బిల్లులు ఇవ్వకుండా ఎంబీలను అధికారులు తమ వద్దే ఎలా ఉంచుకున్నారని అంబాల సర్పంచ్ లింగమూర్తి ప్రశ్నించారు. పలు సమస్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు సభలో తమ గళం వినిపించారు. వీటితో పాటు పలువురు సభ్యులు పలు సమస్యలపై సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు.

సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: బండ శ్రీనివాస్

సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రజాప్రతినిధులకు సూచించారు. గత ప్రభుత్వాలు ఏమి చేయకుండానే గొప్పలు చెప్పుకున్నాయని, మనం చేసిన పనులను చెప్పుకోవడంలో తప్పేమీ లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న దళిత బంధు యూనిట్లకు సంబంధించి తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం డీపీఓ జగదీశ్వర్ మాట్లాడారు. సర్పంచ్‌లకు పలు పనులకు సంబంధించిన సూచనలు చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కల్యాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, ఎంపీడీఓ పల్లవి, తహసీల్దార్ రాణి, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం రావాలి



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ సుధీర్‌కుమార్

కమలాపూర్: దేశ ప్రజలకు మేలు చేసే ప్రజాప్రభుత్వం రావాలని జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్ అన్నారు. ఎంపీపీ తడక రాణి అధ్యక్షతన మంగళవారం జరిగిన కమలాపూర్ మండల సర్వసభ్య సమావేశానికి ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ శ్రీనివాస్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మతతత్వంతో బాగు పడ్డ దేశం లేదని, మతతత్వ శక్తులు, పార్టీలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ రంగంపై 65 శాతం మంది ఆధారపడి ఉన్నారని, 68 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే స్థాయికి తెలంగాణ ఎదిగిందన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే పల్లెల అభివృద్ధి

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



నడికూడ: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నడికూడ: మండలంలోని సర్వాపూర్, నర్సక్కపెల్లి, నడికూడ, ధర్మారం గ్రామాలలో మంగళవారం రూ. 80 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనాలు, మండల కేంద్రంలో రూ. 20 లక్షలతో మహిళ కమ్యూనిటీ భవనం, సర్వాపూర్‌లో రూ 5 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, ఎంపీపీ మచ్చ అనసూర్య, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీఓ సయ్యద్ అఫ్జల్, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి

దామెర: నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని కోగిల్వాయి, వెంకటాపూర్, సింగరాజుపల్లి, దమ్మన్నపేట్, ఒగ్లాపూర్ గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులతో శాయంపేట మండలంలోని ప్రగతిసింగారంలోని ఎమ్మెల్యే నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్చుకోని బీజేపీ అసత్యప్రచారాలు చేస్తోందని విమర్శించారు. సమావేశంలో రెడ్ క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, మండల అధ్యక్షుడు గండు రాము, గీసుకొండ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోలం కృపాకర్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్ రెడ్డి, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, ప్యాక్స్ చైర్మన్ బొల్లు రాజు, నాయకులు దాడి మల్లయ్య, దామెరుప్పు శంకర్, జన్ను మల్లయ్య, ముదిగొండ కృష్ణమూర్తి, కేతిపల్లి శ్రీధర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, సంపత్, యూత్ వింగ్ అధ్యక్షుడు మెంతుల రాజు ఐదు గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న కడియం శ్రీహరి

ధర్మసాగర్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండల కేంద్రానికి చెందిన బాధితులకు స్టేషన్ ఘన్‌పూర్‌లో మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన రేమిడి సుకన్య, కొట్టె ప్రమీత్ కొద్దినెలల క్రితం అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందగా పెద్ద మొత్తంలో ఖర్చు అయింది. దీనితో ఈ విషయం సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రేమిడి సుకన్యకు రూ. లక్ష, కొట్టె ప్రమీత్‌కు రూ. 18000 వేలు మంజూరు చేయించి, బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, అనారోగ్యంతో బాధపడే పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిఇంటికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో ధర్మపురం సర్పంచ్ మునిగాల యాకుబ్, కడియం యువసేన నియోజక వర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎండీ. హఫీజ్, నాయకులు చిలుక విన్నూ, ప్రవీణ్, సుఖేందర్ పాల్గొన్నారు.

గుట్ట మాది.. మొరం తరలిస్తే ఊరుకోం



ఆందోళన చేస్తున్న దామెర రైతులు

దామెర: మండలంలోని వెంకటాపూర్ శివారులో ఉన్న గుట్ట తమదని అక్కడి నుంచి మొరం తరలిస్తే సహించేదిలేదని మండల కేంద్రానికి చెందిన కొంతమంది యాదవ, ముదిరాజ్ కులస్తులు మంగళవారం ఆందోళన చేశారు. వివరాలు.. హైదరాబాద్–భూపాలపట్నం(163) జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం మండలంలోని వెంకటాపూర్ శివారులోని సర్వే నంబర్ 89లోని గుట్ట నుంచి మొరం తీసుకునేందుకు మైనింగ్‌శాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నారు. మంగళవారం గుట్ట నుంచి మొరం తరలించేందుకు జేసీబీ, వాహనాలతో అక్కడికి సంబంధిత సంస్థ వారు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన కొంతమంది మొరం తీయకుండా నిలువరించి ఆందోళనకు దిగారు. దీంతో శాయంపేట్ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులను తహసీల్దార్ వద్దకు తీసుకెళ్లి చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో తాము గుట్టను కొనుగోలు చేసినట్లు పత్రాలు ఉన్నాయని అన్నారు. కెనాల్ తవ్వకాల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం సైతం ప్రభుత్వం చెల్లించిందని, ప్రభుత్వ భూమి ఐనప్పుడు నష్టపరిహారం ఎలా చెల్లించారని ప్రశ్నించారు. గతంలో తమ పేరున పహణీలు సైతం ఉన్నాయని, ఇప్పుడు ప్రభుత్వ భూమని అనడం సరికాదని వాదించారు. దీంతో తహసీల్దార్ ఎండి. రియాజుద్దీన్ మాట్లాడుతూ సర్వే నంబర్ 89లో 121 ఎకరాలు భూమి ప్రభుత్వ భూమిగా రికార్డులో ఉందని తేల్చిచెప్పారు. ఈభూమిపై యాదవులకు, ముదిరాజులకు ఎలాంటి హక్కులు లేవని అన్నారు. దీంతో రైతులు తమకు న్యాయం చేయాలంటూ, తమ భూములు తమకు ఇవ్వకుంటే ఊరుకునేదిలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఆత్మకూర్ సీఐ గణేష్, దామెర ఇన్‌చార్జ్ ఎస్సై అనిల్ కుమార్, శాయంపేట్ ఎస్సై వీరభద్రం పోలీస్ సిబ్బందితో ఎలాంటి గొడవలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



వేలేరు: పిల్లలతో మాట్లాడుతున్న సీఆర్పీ

ధర్మసాగర్(వేలేరు): బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండే విధంగా తల్లిదండ్రులు సహ సమాజంలో ప్రతిఒక్కరూ చొరవ చూపాలని సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్ సూచించారు. వేలేరు మండలంలోని వేపలగడ్డతండా, శాలపల్లి గ్రామాల పరిధిలో మంగళవారం సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. వివిధ కారణాలచే పదవ తరగతి, ఇంటర్ మీడియెట్ పూర్తి చేయని వారు ఈ నెల 13 వరకు ఓపెన్ స్కూల్‌లో చేరవచ్చని తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ వేలేరు ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ కావాలనుకునే వారు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ గడ్డి శ్రీనివాస్ ఫోన్ నంబర్ 9441939243లో సంప్రదించవచ్చని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, ఉపాధ్యాయులున్నారు.

ఎల్కతుర్తి: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, సల్మాన్ పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. మంగళవారం మండలంలోని దామెర గ్రామంలోని ఒడ్డెర, ఎస్సీ కాలనీల్లో బడి బయటి పిల్లల సమగ్ర సర్వే నిర్వహించారు. జనవరి 6నుంచి 18వరకు బడి బయటి పిల్లలపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో బావుపేట సీఆర్పీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి హాత్ సే హాత్

పరకాల: ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న హాత్ సేహాత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి మంగళవారం పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ జోడో యాత్రకు దీనిని సంఘీభావంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రానున్న రోజుల్లో కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను గద్దె దించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం.డీ అలీ, నాయకులు కొలిపాక అర్జున్, చందుపట్ల రాజిరెడ్డి, దుగ్యాల రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దామెర: హాత్ సే హాత్–కాంగ్రెస్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి వెల్లడించారు. మండల కేంద్రం సమీపంలో కాంగ్రెస్ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి రాష్ట్రంలో చేపట్టనున్న యాత్రలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రాజు, సంపత్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, భిక్షపతి, దామెర ఉపసర్పంచ్ నాగేశ్వర్ రావు, మధు, పోచయ్య, శంకర్ ఉన్నారు.

ఇళ్ల స్థలాలు అందించాలి

శాయంపేట: మండలంలోని ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మందారిపేట గ్రామ శివారులోని ప్రభుత్వ భూములను మంగళవారం వారు పరిశీలించారు. సర్వే నెంబర్ 632/1లో 49 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, కొంతమంది ఈ భూమిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. ప్రభుత్వం దానిని గుర్తించి పేదలకు పంపిణీ చేయాలన్నారు.ఇందులో తిరుపతి, సురేష్, తిరుపతి, శ్రీనివాస్, కల్యాణ్, ప్రశాంత్, పాల్గొన్నారు.

ప్రజలు సుఖశాంతులతో ఉండాలి

- ఎమ్మెల్యే అరూరి రమేష్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు: పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కంఠమహేశ్వర స్వామి, సూరమాంబ అమ్మవార్లతో పాటు రేణుక ఎల్లమ్మలను వేడుకున్నట్లు ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొండపర్తి గ్రామంలో మూడు రోజుల పాటు జరుగనున్న కంఠమహేశ్వర స్వామి, సూరమాంబల కల్యాణం, రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ ఉత్సవాల్లో రెండవ రోజు ముఖ్య అతిథిగా ఎమ్మెలే అరూరి రమేష్ హాజరయ్యారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా ఆరాధించిన ఎమ్మెల్యే అనంతరం గ్రామస్తులు ఇచ్చిన విందును స్వీకరించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మేరుగు రాజేందర్ కుటుంబానికి మంజూరైన రూ. 60 వేల చెక్కును ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్నేని మధుమతి, వైస్ ఎంపీపీ తంపుల మోహన్, సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, వైస్ చైర్మన్ మాదాసు బాబు, మాజీ ఆలయ చైర్మన్ మునిగాల సమ్మయ్య, సర్పంచ్ రాజమణి బెన్సన్, ఉప సర్పంచ్ సంపత్‌రావు, కట్కూరి రాజు, భూపాల్‌రెడ్డి, వెంకన్న, పిట్టల సుధీర్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి



కమలాపూర్: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈఓ



ఐనవోలు: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కమలాపూర్: ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చందుపట్ల రాజేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కమలాపూర్‌లోని మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ రాంకిషన్‌రాజు, మండల నోడల్ అధికారి పుల్ల సంపత్ చేతుల మీదుగా 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయుల పదోన్నతులు ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేయడంతో ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. సమస్యల పరిష్కారానికి అనేకసార్లు సీఎం సహ మంత్రులు హామీలు ఇవ్వడమే తప్పా, కార్యాచరణకు పూనుకోవట్లేదని అన్నారు. ఇందులో పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐనవోలు: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుదర్శనం డిమాండ్ చేశారు. మంగళవారం డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ విద్యారంగం మరింత సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపు ప్రతి సంవత్సరం తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యవేక్షక పోస్టులు గత 17 సంవత్సరాలుగా నింపలేదన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

ఈ నెల 13,14 తేదీలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర 5వ మహాసభలను రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో నిర్వహిస్తున్నారు. ఈమేరకు విద్యాసదస్సు, మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి సీఎస్‌ఆర్ మాలిక్ పిలుపునిచ్చారు. రాష్ట్ర విద్యా మహాసభల వాల్‌పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను మండల కేంద్రంలో ఐనవోలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీహర్షుడు ఆవిష్కరించారు. అలాగే కమలాపూర్ ఎంఈఓ ఇ.రాంకిషన్ రాజు మండల వనరుల కేంద్రంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో విద్యారంగ సమస్యలపై, ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై చర్చిస్తారని, సదస్సులు, సమావేశాలు ఉత్సాహభరితంగా ఉంటాయని తెలిపారు. ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఇందులో పలువురు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చేరిక

నడికూడ: బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో బీసీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వరికెల కిషన్ రావు ఆపార్టీలోకి చేరారు. ఆయనకు ప్రవీణ్‌కుమార్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ గత 75 సంవత్సరాలుగా బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూడడం జరిగిందన్నారు. తనపై నమ్మకం ఉంచి తనకి అవకాశం ఇచ్చిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

పనులు ప్రారంభం



దామెర: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాఠశాల ప్రహరీ నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎం. వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ. 14 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కాగా పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఇందులో పలువురు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్



ధర్మసాగర్(వేలేరు): వేలేరు మండలంలోని పీచర గ్రామంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ రేణుక ఆధ్వర్యంలో మంగళవారం పోషణ అభియాన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషివిజ్ఞాన కేంద్ర సౌజన్యంతో తల్లులకు కిచెన్ గార్డెన్, ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా సీడీపీఓ మధురిమ,ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణబంధు ప్రకటించాలి



పరకాల: నాయీ బ్రాహ్మణులను ఆదుకునేందుకు ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ బంధు పథకం ప్రవేశపెట్టాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు తూముల రఘువీర్ డిమాండ్ చేశారు. మంగళవారం పరకాల, నడికూడ మండలాల నాయీబ్రాహ్మణుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి తూముల రఘువీర్ మాట్లాడారు. అర్హులైన వారందరికి డబుల్ బెడ్రూం ఇళ్లు, హెల్త్‌కార్డులు, 50 సంవత్సరాలు పైబడిన నాయీ బ్రాహ్మణులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. అదే విధంగా మోడ్రన్ సెలూన్లు మంజూరు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో పరకాల, నడికూడ మండలాల అధ్యక్షులు తూముల బాబు, ఐలిపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమం

పరకాల: రాష్ట్రంలో బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలంతా ఆర్ఎస్పీ ఆదేశాలతో ముందుకు వెళ్లాలని బీఎస్పీ పరకాల అసెంబ్లీ అధ్యక్షుడు ఎల్తూరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని నాగారం గ్రామంలో పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్రవర్ణాల చేతుల్లో దోపిడికి గురవుతున్న బహుజనుల కోసం ఉన్నత ఉద్యోగానికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజీనామా చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ పరకాల నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరువు నష్టం దావా వేస్తా..

పరకాల: కేఆర్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను జీర్ణించుకోలేకనే బీజేపీ నాయకులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని డిజి యోధ సంస్థ, కేఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొక్కిరాల రాకేష్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై తప్పుడు ప్రచారం వేసేవారిపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. చల్లా చారిటబుల్ ట్రస్టు ద్వారా నిరుపేద యువతీయువకులకు ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షల కోసం ఉచితంగా కోచింగ్ ఇస్తుంటే మానవతా దృక్పథంతో తాను రూ.5లక్షల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నట్లు తనకు ఎలాంటి వివాదాస్పద భూమితో సంబంధం లేదన్నారు.

సైబర్ వలలో యువకుడు

ధర్మసాగర్(వేలేరు): సైబర్ వలలోపడి ఓ యువకుడు మోసపోయిన ఘటన మండలంలోని కమ్మరిపేట గ్రామంలో జరిగింది. ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కమ్మరిపేటకు చెందిన కోడెం రవికుమార్ నవంబర్ నెలలో ఫేస్‌బుక్‌లో వచ్చిన మెసెజ్‌ను చూసి ఒక ఆప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో గుర్తు తెలియని వ్యక్తి రూ. 11 లక్షల లోన్ మంజూరు చేస్తామని నమ్మపలికి 17 విడతలుగా దాదాపు రూ. 2,26,686 వరకు డబ్బులు కట్టించుకున్నాడు. అయినా లోన్ మంజూరు చేస్తానన్న వ్యక్తి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.